క్లుప్తంగా

టీకాతో ఆరోగ్యం



చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

కోవెలకుంట్ల: ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు వేసే టీకాలతో ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభాని అన్నారు. బుధవారం మండలంలోని రేవనూరు పీహెచ్‌సీ పరిధిలోని ఆయా గ్రామ సచివాలయాల్లో మిషన్ ఇంద్రధనస్ కార్యక్రమం ద్వారా చిన్నారులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో 15 రోజులపాటు సర్వే నిర్వహించి ఐదు సంవత్సరాల్లోపు పిల్లలు ఇప్పటి వరకు వేయించుకోని చిన్నారులను గుర్తించి టీకాలు వేశామన్నారు.

ఉపాధి పనుల లక్ష్యాన్ని అధిగమించాలి

కోవెలకుంట్ల: 2023–24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీపథకం కింద నిర్ధేశించిన పనుల లక్ష్యాన్ని అధిగమించాలని ఎంపీడీఓ రాధిక సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆ పథక మండల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు.ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మామిడి, చీని, సపోట, నిమ్మ, దానిమ్మ, తదితర పంటల సాగుకు సన్న, చిన్నకారు రైతులకు వివిధ రూపాల్లో ప్రోత్సాహం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీవిద్య, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

బనగానపల్లెరూరల్: పుస్తక పఠనంతో క్రమశిక్షణతో విజ్ఞానవంతులు అవుతారని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి సూచించారు. బుధవారం మండలంలోని పలుకూరులో జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం సందర్భంగా పుస్తకం ప్రాముఖ్యత, ప్రయోజనలనుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు.

కండ్లకలక మందుల పంపిణీ

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పేండేకల్లు జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కండ్లకలక నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులు వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రామేశ్వర్‌రెడ్డి, శ్రీధర్ సూచించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు సత్తార్, మగ్బుల్, వీరారెడ్డి, వీరభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూలు అడ్మిషన్స్ ప్రారంభం

బేతంచెర్ల: ఏపీ ప్రభుత్వ ఓపెన్ స్కూలు అడ్మిషన్స్ ప్రారంభమైనట్లు భాగ్యోదయ హైస్కూల్ చైర్మన్ కానాల నాగ లక్ష్మీదేవి బుధవారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో 10 వతరగతి, ఇంటర్ కోర్సులకు అపరాధ రుసుం లేకుండా సెప్టెంబర్ 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. అపరాధ రుసుంతో అక్టోబర్ 5 వరకు అవకాశం ఉందన్నారు. చదువు మధ్యలో మానివేసినవారు, నాల్గవ తరగతి ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


ఎస్టీయూ సభ్యత్వ నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం, ఎం.పేండేకల్లు,ఆర్ఎస్ రంగాపురం, గూటుపల్లె పాఠశాలలను బుధవారం ఎస్టీయూ నాయకులు సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ కృషి చేస్తుందని నంద్యాల జిల్లా అధ్యక్షుడు అజాంబేగ్ తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పుల్లయ్య, మండల అధ్యక్షుడు నాగేశ్వర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

డోన్ టౌన్ : స్థానిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రముఖ శాస్త్రవేత్త, డాక్టర్ యల్లా ప్రగడ సుబ్బారావు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు సేవలను పట్టణ ప్రాంతీయ వైద్యశాల డాక్టర్ షాబాజ్ హుస్సేన్, సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫీ గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది మల్లెమాల, నాగరత్నమ్మ, హరి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రామసుబ్బారెడ్డి



కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రామసుబ్బారెడ్డిని నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కేశవరావు ఉమ్మడి అనంతపురం జిల్లా పెనుగొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న రామసుబ్బారెడ్డిని ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

సీతారామాపురం.. అభివృద్ధి బాట!



కాలనీలో వేసిన సీసీ రోడ్డు



నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్



గ్రామం పేరుతో నిర్మించిన ఊరవాకిలి

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురం గ్రామం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో అభివృద్ధి బాటలో పయనిస్తుంది. సుమారు 300 కుటుంబాలు, 1500 మంది ఓటర్లు ఉన్న ఈగ్రామం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. వీధి వీధికి సీసీ రోడ్లు నిర్మించడంతో రహదారులు కళకళలాడుతున్నాయి. ప్రభుత్వం నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలతో గ్రామానికి కొత్త శోభ వచ్చింది. అదేవిధంగా ప్రాథమిక పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. మంత్రి చొరవతో కర్నూలు ప్రధాన రహదారి నుంచి గ్రామానికి రూ.2.80 కోట్లతో డబుల్ రోడ్డు మంజూరైంది. 2021 ఫిబ్రవరి 17 న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన చిట్టి వేణుగోపాల్ రెడ్డి ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారు. సీతారామాపురం గ్రామంలో ఊరవాకిలి నిర్మించి అందులో సీతారాముల ఏర్పాటు చేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, మరో రూ. 5 లక్షలతో డ్రైనేజీ కాలువలు, రూ.25 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్, రూ.10 లక్షలతో పొలాలకు వెళ్లే రహదారి ఏర్పాటు చేశారు. సీతారామాపురానికి పట్టణ శోభ సంతరించిఉకుంది. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మంత్రికి మెకానిక్‌ల కృతజ్ఞతలు



మంత్రికి వినతి పత్రం అందజేసిన మెకానిక్‌లు

డోన్ టౌన్ : రవాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న మెకానిక్‌లకు ఆటో నగర్ ఏర్పాటుకు స్థలం కేటాయిస్తానని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు కృతజ్ఞతగా బుధవారం డోన్ పర్యటనకు వచ్చిన మంత్రిని కొత్తకోట గ్రామంలో కలిసి మెకానిక్‌లు వినతి పత్రం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ నాయకులు ఉసేన్, లింగం, పరుశరాముడు, నాయుడు, గౌస్, సుభాన్, రఫీ, మాబాషా, కేశవ్, కొత్తపల్లె భాషు తదితరులు ఉన్నారు.

గోదాముల్లో దిగుబడులు నిల్వ చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: రైతులు పండించిన ఉత్పత్తుల దిగుబడులు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోతే ప్రభుత్వ గోదాముల్లో నిల్వ చేసుకోవాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) ప్రోగ్రాం డైరక్టర్ శ్యామ్ కుమార్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రుద్రవరం నారాయణ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గోదాముల్లో నిల్వ ఉంచిన పంటలకు 80 శాతం బ్యాంకుల నుంచి రుణం తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం హెచ్ కొట్టాల గ్రామ సమీపాన ఉన్న గోదాములను పరిశీలించి, ధాన్యం నిల్వ ఉంచుకునే విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ముద్దుస్వామి, నాగరాజు,నాగేశ్వరరావు, బలరాముడు, బుగ్గన కుమార్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎద్దులన్న, సబ్‌డివిజనల్ అధికారి వెంకటేష్, సెక్రటరీ ఓబులేసు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి



గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్

కోవెలకుంట్ల: గర్భిణులు తప్పనిసరిగా ఆరోగ్యసూత్రాలు పాటించాలని రేవనూరు పీహెచ్‌సీ డాక్టర్ విద్యాసాగర్ సూచించారు. బుధవారం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ) కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భందాల్చినప్పటి నుంచి ప్రసవించే వరకు ప్రతి నెలా డాక్టర్లను సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మాతా, శిశు మరణాల రేటును తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, స్టాఫ్‌నర్స్ మేరి, ల్యాబ్ టెక్నిషియన్ జయలక్ష్మి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

కొలిమిగుండ్ల: గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎం) పథకంలో భాగంగా ప్రతి నెలా 9న గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో గర్భిణుల ఇళ్ల వద్దనే అవసరమైన పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామన్నారు.

అన్ని వర్గాలకు సమన్యాయం



యంబాయి గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ పాలన సాగిస్తున్నాని యంబాయి గోరుమానుకొండ, గ్రామాల సర్పంచ్‌లు యుగంధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని యంబాయి గ్రామంలో బుధవారం 'మీ ఓటు విలువ..ఒక మార్పు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలతో మాట్లాడి ఓటు ప్రాముఖ్యత ను సర్పంచ్‌లు వివరించారు. మండల చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా మంత్రి బుగ్గన రాజేంద్రనా థ్‌రెడ్డి సారథ్యంలో గ్రామగ్రామానికి రహదారి, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు అయ్యాయని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యాకోబ్, రవి,ఎద్దులన్న ,మునిస్వామి,బాలశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

12న అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రి బుగ్గన

బేతంచెర్ల: మండలంలో పలు అభివృద్ధి పనులలను ఈనెల 12వ తేదీర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభిస్తారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. 12న శనివారం ఉదయం 9:30 గంటలకు రంగాపురంలో మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ముఖ ద్వార శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో 10:30 గంటలకు సుమారు రూ.80 లక్షలతో పూర్తయిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌ను, 11 గంటలకు నూతనంగా రూ. 30 లక్షలతో నిర్మించిన ఉర్దూ స్కూల్ నూతన భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాలను కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమి సభ్యులు మూర్తుజావలీ, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, దస్తగిరి, ఖాజా, సలీమ్, సయ్యద్, అజామ్, నజీర్, ముస్తఫా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

బనగానపల్లెరూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కౌసల్యదేవి ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అమర వీరుల గౌరవ సూచికగా ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి దేశ పురోగతికి తమవంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రామకృష్ణ, రవి కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలను ప్రశాంతంగా జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుష్పకుమారి

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో వార్డుమెంబర్ల ఉప ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరపాలని తహసీల్దార్ పుష్పకుమారి తెలిపారు. బుధవారం స్థానికతహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని కోవెలకుంట్ల, చిన్నకొప్పెర్ల, కలుగొట్ల, సౌదరదిన్నె గ్రామాల్లో ఒక్కో వార్డు మెంబర్ల ఎన్నికకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 12న పరిశీలన, 14న నామినేషన్ల ఉపసంహరణ, 19న పోలింగ్ అదే రోజున ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉంటుందన్నారు.కార్యక్రమంలో ఎంపీడీఓ రాధిక, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఏడు నామినేషన్‌లు

కొలిమిగుండ్ల: పంచాయితీ ఉప ఎన్నికల్లో భాగంగా వార్డు మెంబర్ స్థానాలకు బుధవారం రెండో రోజు ఏడు మంది నామినేషన్‌లు వేసినట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కనకాద్రిపల్లె పంచాయితీ స్థానానికి వడ్డె లక్ష్మిదేవి, ఓబులేసు, పత్ర కుమారి, శ్రీనివాసులు, నవీన్‌కుమార్ నామినేషన్‌లు దాఖలు చేశారు. బెలుం నాల్గవ వార్డు స్థానానికి కొండ మహేశ్వరి, అంకిరెడ్డిపల్లె ఒకటవ వార్డు స్థానానికి నాగేంద్ర కుమార్ నామినేషన్ వేశారన్నారు.

రామాపురంలో....

అవుకు: మండల పరిధిలోని రామాపురం గ్రామ పంచాయతీలో ఖాళీగా ఏర్పడిన రెండవ వార్డు మెంబర్ స్థానానికి బుధవారం మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీధర్‌రావు తెలిపారు. వడ్డె విజయ్, వడ్డె దస్తగిరి, వడ్డె చౌడేశ్వరీ నామినేషన్లు వేసారన్నారు. అయితే అన్నవరం గ్రామ పంచాయతీలో ఖాళీగా ఉన్న సర్పంచ్ స్థానానికి, కొండమనాయునిపల్లె పంచాయతీలో ఖాళీగా ఉన్న 7వ వార్డు మెంబర్ స్థానానికి ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారులు రామక్రిష్ణవేణి, అబ్దుల్ హక్ తెలిపారు.

ప్యాపిలిలో ఐదు నామినేషన్లు...

ప్యాపిలి: మండల పరిధిలోని కొలుపల్లి, నల్లమేకలపల్లి, మాధవరం, అలేబాదుతండా, మునిమడుగు, ఎన్ రంగాపురం, ప్యాపిలి తదితర గ్రామాల్లో ఒక్కో వార్డు మెంబర్ల స్థానానికి ఉప ఎన్నిక జరుగనుంది. ఈ మేరకు మొదటి రోజైన మంగళవారం ఎన్ రంగాపురంలో ఒక నామినేషన్ దాఖలు అయ్యింది. బుధవారం ప్యాపిలి, మునిమడుగు గ్రామాల్లో ఒక్కో నామినేషన్, అలేబాదుతండాలో రెండు నామినేషన్ల చొప్పున దాఖలైనట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ తెలిపారు.

రెండవ రోజు నామినేషన్ నిల్

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల, ఆల్వకొండ, పేరుపోముల గ్రామాలలో జరిగే వార్డు మెంబర్ల ఉప ఎన్నికకు రెండవ రోజు బుధవారం ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్ స్వీకరణ పక్రియ ముగుస్తుందన్నారు.

భక్తిశ్రద్ధలతో కావడి పీర్ల జార్తలు



పీర్లను దర్శించుకుంటున్న భక్తులు

డోన్ టౌన్ : పట్టణంలోని బంగారయ్యపేటలో కొలువైన కావడి పీర్ల జార్తలు బుధవారం భక్తిశ్రద్ధతో నిర్వహించారు. కౌన్సిలర్ దినేష్‌గౌడ్ కావడి పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. అదేవిధంగా భక్తులు పెద్దఎత్తున పీర్లను దర్శించుకుని చెక్కెర చదింపులు చేశారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

జక్కసానికుంట్లలో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు

ప్యాపిలి: మండల పరిధిలోని జక్కసానికుంట్ల గ్రామంలో బుధవారం ఫ్యామిలి ఫిజిషియన్ సేవలు అందజేశారు. వైద్యాధికారిణి వాణిశ్రీ తమ సిబ్బందితో కలసి ప్రజలకు జనరల్ ఓపీ నిర్వహించారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అనంతరం రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని వైద్యాధి కారి నితీశ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.ఐదు సంవత్సరాలలోపు చిన్నారుల కు టీకాలు వేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్, వైద్య సిబ్బంది గంగాదేవి, మనోహర్ రెడ్డి, సుభాన్ పాల్గొన్నారు.

సన్మానం

బేతంచెర్ల: మండలపరిధిలోని గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు షఫీ ఉల్లా, రమేష్ బాబు, అహ్మద్ హుస్సేన్, హెప్సిబా జ్యోతిని ఘనంగా సన్మానించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ రామసుబ్బయ్య, హెచ్ఎం మద్దిలేటి రెడ్డి, ఉపాధ్యాయులు శివ కుమారస్వామి తదితరులు వారికి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

ఘనంగా ఆదివాసీల దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుంకన్న

ప్యాపిలి: ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని బుధవారం ఎరుకల సేవా సంఘంలో ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్‌లోని ఏకలవ్యుడి విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నినాదాలు చేశారు. ఎరుకల సోదరులు తమ హక్కుల కోసం పోరాడాలని నాయకులు సుంకన్న, సురేశ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, గోపాల్, వెంకటేశ్, గురుమూర్తి, శ్రీను, పరమేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత



నగదు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం గ్రామానికి చెందిన సూరిబాబు కుటుంబ సభ్యులకు బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను గ్రామ సచివాలయ సిబ్బంది అందజేశారు. రెండు రోజుల క్రితం సూరిబాబు అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రభుత్వ మంజూరు చేసిన తక్షణ సాయాన్ని మృతుడి భార్య జయమ్మకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు నరేష్, పర్వేజ్, వెల్ఫేర్ అసిస్టెంట్ లావణ్యదేవి, వలంటీర్ రవి పాల్గొన్నారు.

పండ్లు,బ్రెడ్డు పంపిణీ



బాలింతకు పండ్లు అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : సినీ హీరో మహేష్‌బాబు జన్మదినం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని బాలింతలు, గర్భిణులు, రోగులకు పండ్లు బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేష్ బాబు ఫ్యాన్స్ సంఘం అధ్యక్షుడు ఖాధర్, అభిమానులు రాజా విజయ్‌కుమార్, ఆర్‌ఆర్ నాయుడు, మినాజ్, జావీద్, గౌస్ పాల్గొన్నారు.

అవుకు ప్రభు త్వ ఆసుపత్రిలో...

అవుకు: కాపు సంక్షేమ సేన నాల్గొవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం పట్టణంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బలిజ సంఘం కార్యాలయంలో శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి మోహనరంగా చిత్రపటాల కు పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం అవుకు ప్రభు త్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. బలిజలు ఐకమత్యంగా మెలగాలని ఈ సందర్భంగా కాపు సంక్షేమ సేన నంద్యాల పార్లమెంట్ అధ్యక్షుడు గుర్రాల రామాంజినేయులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేఎస్ఎస్ పెద్దలు గాజుల కృష్ణ కుమార్, కునుకుంట్ల హరి, బలిజసంఘం పెద్దలు కంపిలి నారాయణ, కునుకుంట్ల రామన్న, మామిళ్ల సుబ్బన్న, వేటూరి రమణ, జక్కా మధు, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీడిన టెన్షన్ !

బనగానపల్లె: మండల పరిధిలోని మీరాపురం యాగంటి కొండల మధ్య మంగళవారం జీ స్వాతి పేరున్న పాఠ్యాపుస్తకాలతోపాటు విద్యా సమాగ్రిని పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. ఈ సంఘటనతో ఏమి జరిగి ఉంటుందన్న సందేహంతో పోలీసులు టెన్షన్‌కు గురయ్యారు. అయితే బుధవారం స్వాతితో పాటు తల్లి మల్లేశ్వరిని ఎస్ఐ రామిరెడ్డి గుర్తించడంతో టెన్షన్ వీడింది. ఎస్ఐ రామిరెడ్డి వివరాల మేరకు జీ స్వాతి సొంత ఊరు ప్రకాశం జిల్లా గిద్దలూరు. కడప జిల్లా మైదుకూరు వద్ద ఉన్న ఖాజీపేట ప్రభుత్వ పాఠశాలలో స్వాతి 1వ తరగతి విద్యాభ్యసిస్తుంది. స్వాతి తండ్రి వెంకటేశ్వర్లు తాగుడుకు బానిసకావడంతో దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం బనగానపల్లె మండలం క్రిష్టగిరి మెట్ట వద్ద ఉన్న దిగంబర ఆశ్రమంలో అవులు కాచుకుంటూ తల్లి కూతురు జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 7న స్వాతి తల్లి మల్లేశ్వరితో కలిసి పుస్తకాలతో నడుచుకుంటూ గోవిందిన్నెకు వెళ్తూ మార్గమధ్యలో పుస్తకాలు బరువు ఉండడంతో కొండల మధ్యనే వదలేశారన్నారు.

ప్రతి ఒక్కరూ దేశ భక్తిని చాటాలి



ఆదర్శ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ చల్లా



సౌదరదిన్నెలో నా భూమి- నాదేశం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు



నా భూమి - నాదేశం కార్యక్రమంలో భాగంగా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

అవుకు: దేశ భక్తిని ప్రతి ఒక్కరూ చాచాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాల, శివవరం గ్రామం పాఠశాలలో నా భూమి– నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన స్థానిక మహనీయులు, వీరులను స్మరించుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని చేపట్టాయన్నారు. వారు చేసిన సేవలు మరవకుండా ఉండటం కోసం యా గ్రామాల్లోని పాఠశాలల వద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం వీరులకు వందనం అంటూ అవుకు పట్టణానికి చెందిన వీర జవాన్ సిద్ది సుబ్బరామయ్య పేరుతో పాటు పీఎం, సీఎం సందేశాలతో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తెలుగు రామప్ప, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ అనీఫా,ఈఓ అశ్విన్ కుమార్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కరిముల్లా,సర్పంచ్‌లు మందా గుర్రమ్మ, భవ్య, ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో జాతీయ జెండా ఎగరాలి

కోవెలకుంట్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో పంద్రాగస్టు వేడుకల సందర్భంగా జాతీయ జెండా ఎగుర వేయాలని ఉపాధి పథక ఏపీడీ సాంబశివరావు, ఎంపీడీఓ రాధిక పిలుపునిచ్చారు. నా భూమి- నాదేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని సౌదరదిన్నె, కంపమల్ల గ్రామాల్లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయ్యాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర దినోత్సవ వేడుకలను వైభవంగా జరిపేందుకు వారం రోజులపాటు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం అనే నినాదాలతో సదస్సులు కొనసాగుతున్నాయన్నారు. పంద్రాగస్టు రోజున స్వాతంత్ర సమరయోధులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, ఏపీఓ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలునాటి సంరక్షించాలి

బేతంచెర్ల: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ వెంగన్న అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆర్ బుక్కాపురం గ్రామంలో 'మా భూమి – నాదేశం' కార్యక్రమంలో భాగంగా ఏపీఓ శేషన్న, గ్రామ సర్పంచ్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి హరిత ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు శిలాఫలకం ఏర్పాటు చేశారు. నేల తల్లికి నమస్కారం వీరులకు వందనం, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

మరణ ధ్రువీకరణపై తప్పుడు సమాచారం.. కేసు నమోదు

బనగానపల్లెరూరల్: నంద్యాల పట్టణానికి చెందిన కె.వినోద్‌కుమార్ అనే వ్యక్తిపై తన తల్లి మృతిపై తప్పుడు సమాచారం అందజేసి డెత్ సర్టిఫికెట్ తీసుకున్న నేపథ్యంలో కేసు నమోదు చేసినట్లు నందివర్గం పోలీసు స్టేషన్ ఎస్ఐ రామాంజనేయరెడ్డి బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన తల్లి సీతమ్మ గతేడాది 1-12- 2022 వ తేదీన టంగుటూరు గ్రామంలోని తమ బంధువుల ఇంటికి వచ్చి ఇక్కడే మృతి చెందిందని వినోద్‌కుమార్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌నాయక్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి డెత్ సర్టిఫికెట్ తీసుకున్నాడు. వాస్తవానికి సీతమ్మ 30-01-2023న నంద్యాల పట్టణంలోనే మృతి చెందింది. విషయం తెలుసుకున్న కార్యదర్శి శివశంకర్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామానికి చెందిన ఇరువర్గాలపై బుధవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ నరేంద్ర కుమార్ తెలిపారు. ఒక వర్గానికి చెందిన దూల రాజేష్, యేసేపు, ప్రభావతి, సుశీల, మానస, అనిల్, అలాగే మరో వర్గానికి చెందిన గౌరి సుబ్బమ్మ, సాలమ్మ, జ్ఞానమ్మ, జయమ్మ, ప్రమీల, కిశోర్ బాబు ఇంటిస్థలం విషయంలో ఘర్షణ పడ్డారు. స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తుండటంతో 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్య



మృతి చెందిన సోమశేఖర్

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన చిన్న అయ్యన్న కొడుకు లారీ డ్రైవర్ సోమశేఖర్ కడుపునొప్పి తాళలేక ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో బుధవారం ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు సోమశేఖర్‌ను (32) ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య శైలజతో పాటు కుమార్తె సంతానం. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.